అడల్ట్స్ ఓన్లీ కథ A

# అసలైన తోడూ నీడా

"నన్నూ రమ్మంటావా?"

అడిగాడు తను.

కిచెన్‌లో పాలకు 'తోడు' వేస్తూ వద్దన్నట్లు అడ్డంగా తలూపాను.

నేను వెళ్లేది గైనకాలజిస్ట్ దగ్గరికీ! అందులో నా స్నేహితురాలి దగ్గరికి! ఆడవాళ్ళ అంతరంగిక విషయాలు మగాళ్ళకెందుకు- అతడు భర్తైనా సరే!

"ఒక్కత్తివే ఎందుకు?! నేనూ..." సూటిగా కళ్ళలోకి చూశానంతే!

ఆగిపోయాడు.

"అంతగా భయపెట్టించడం అవసరమా!?" తన ముఖంలో గుబులు.

ముసి ముసిగా నవ్వుతూ మరో పనిలోకి మారిపోయా.

"...పోనీ ఎందుకు వెళ్ళడమో కారణమైనా చెప్పొచ్చుగా!?"

"...అది తెలీకనే కదా!" నా వాక్యానం.

కాస్త హర్టయ్యాడు. ఒక చూపు...ఆ ఎక్స్‌ప్రెషన్ చూస్తే నాకు జాలేసింది.

వస్తూ వస్తూ గుమ్మంలో నిలుచున్నతనకి బుగ్గమీద ఒక ముద్దిచ్చి "కూల్ యార్" అంటూ వెక్కిరించా.

శిలను ముద్దాడిన అనుభూతి- కదలకుండా అలాగే ఉండిపోయాడు. అందుకే, అతిగా ప్రేమించుకోవడమంటే అతిగా బాధించుకోవడమే! అంటాన్నేను.

పాపను ఒళ్ళోకి తీసుకుని పాలివ్వబోయా.

ఎదురుగా తను.

"ఎక్స్‌క్యూజ్‌మీ" అన్నాను కవ్వింపుగా!

తీక్షణంగా నా వైపోసారి చూసి బయటకెళ్లిపోయాడు.


నేనిక స్తన్యం పాపనోటి కందించానో లేదో నా కళ్ళలో కన్నీళ్ళు సుడి తిరిగాయ్! ముళ్ళతో గుచ్చినట్లు నొప్పి.

కనులు గట్టిగా మూసుకున్నా- కన్నీళ్ళు పాప తలమీద రాలిన తడి.

★ ★ ★

వెళ్ళేటప్పుడు అనుమానంతో వెళ్ళా. వచ్చేటప్పుడు ఒక్కదాన్నే రాలేకపోయా. వెంట హేమ కూడా రావాల్సి వచ్చింది.

హేమ నా స్నేహితురాలు. గైనకాలజిస్టు.



చాలా ధైర్యం చెప్పింది. ప్రాణం కంటే ఏ అవయవం గొప్పకాదని చెప్పింది. దానికీ లోలోన దిగులుగానే ఉంది. డాక్టరు కదా! ధైర్యం చెబుతూనే ఉంది దారి పొడవునా.

సాయంత్రమవుతుండగా వచ్చాడు అభీ-

'ఏమైందీ?! డాక్టరేం చెప్పారు?!' అని ఉబలాటంగా అడుగుతాడనుకున్నా.

నా వైపోసారి చూపుసారించి- పది నిమిషాల్లో

సుగంధ శ్రీనివాస్

కడిగిన ముత్యంలా తయారయాడు-నా ముందర కాఫీ కప్పుతో!

కనీసం పలకరించినా బావుండు- అంతా చెప్పేద్దును.

ఖాళీ కప్పులను తీసుకెళ్తూ నా వైపోసారి చూశాడు.

''అభీ..'' పిలిచాను. గొంతుదాటి పలుకే రాదేంటి?!

కంప్యూటర్ ముందర కూర్చున్నాడు. ఏదో డాటా ఫీడ్ చేస్తున్నాడు. దగ్గరగా వెళ్లి నిలుచున్నాను. భుజాల మీద చేతులేయబోయా.

ఎన్నడూ తనతో గారాలు పోలేదుగా! అహం అడ్డు తగిలింది.

ఆయన మీదికి లాక్కుంటే బావుండు- ఆ ఒడిలో తలవాల్చి ఏమైనా కబుర్లు వినాలని ఎంత కోరికగా ఉందో!? ఏనాడూ తనిలా మురిపాలు కావాలని ఆశించలేదు. మరి ఈ రోజేంటి?!

ఆలోచనలు మేఘాల్లా కమ్ముకుంటున్నాయి. అంతే! పాప పక్కనే వచ్చి వాలా.

★ ★ ★

దాదాపు మూడేళ్ళ క్రితం సంగతి- నేనప్పుడు క్యాంపస్‌లో పీజీ చేస్తున్నా- ఒకసారి మా ఫ్రెండ్స్‌తో బాతాఖానీ కొడుతుండగా మగవాళ్ళతో పాటు 'మొగుళ్ళ' టాపిక్ వచ్చింది.

''...మరి నీక్కాబోయే వాడెలా ఉండాలే బృందా..?'' ఓ ఫ్రెండ్ అడిగింది.

''..మగాడిలా ఉండాలి. అవసరానికి ఆడదానికి మరో ఆడతోడులా మారాలి''

చప్పట్లు-ఈలలు! (ఈలలు అమ్మాయిలు ఇంకా బాగా వేస్తారు)

''అది సరే! తమర్నెలా చూసుకోవాలి. మీరసలే పే..ద్ద.. ఫెమినిస్టు కదా!'' అది వ్యంగ్యం కాదు నా టాలెంటుమీదున్న ఈర్ష్య. ఇది అప్పటి నా ఫాలోయింగు.

''..నవ్వించాలి...నవ్వనివ్వాలి!''

''..వాహ్!'' ఒక అభినందన.

''...అంతేనా!?'' ఒక ఆశ్చర్యం.

నాకలాంటి భర్తే లభించాడు!

పెళ్ళికి ముందే చెప్పా ''నేనుద్యోగం చేస్తా''నని.

''సరే!'' అన్నాడు.

''ఇప్పుడే పిల్లలొద్దు'' అన్నాను.

''నీ ఇష్టం'' అన్నాడు.

పెళ్ళి జరిగిన కొన్నాళ్ళకు ''..నీ మీద అధికారం చెలాయిస్తున్నానా?'' అడిగాను.

''అలాగెందుకనుకుంటున్నావ్? అతిగా ఆరాధిస్తున్నావేమో?!''

నేనాశ్చర్యంగా చూశా. ''అంత లేదు'' నా గొంతులో రెచ్చగొట్టేంత కైపు.

## ఒకరికి ఒకరై తోడుంటే..

వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద అరెస్టయిన సల్మాన్ ఖాన్ ఇప్పుడు వార్తల్లో వ్యక్తి అయితే ఆయన్ని కలవడానికి జైలుకెళ్ళిన కత్రినాకైఫ్ గురించే అంతా చర్చించుకుంటున్నారు. మామధ్య ఏమీలేదని చెప్పే కత్రినా స్నేహం వల్లే ఇలా కలిశానని చెబుతోంది. ఇదిలా ఉంటే కత్రినా కలిసి వచ్చాక సల్మాన్ బెయిల్‌పై విడుదలకావడం విశేషం. ఏదిఏమయినప్పటికీ వీరిద్దరూ ఒకరిని విడిచి మరొకరు ఉండలేరేమో అన్పిస్తోంది కదూ!



''...బృందావనా! ఆజ్ఞలు ఎవరికి జారీ చేస్తారు. 'నా' అనే భావనా హక్కు గలవాళ్ళకే కదా! అలాంటప్పుడు నీ మాటలు నాకు నచ్చినప్పుడు- అవి నా అభిప్రాయాలలో కలిసిపోయినప్పుడు- నీమాటే వింటే తప్పేంటి?!''

''దాన్నేమంటారు?!'' నాకింకా జ్ఞానోదయం కాలేదు.

''ప్రేమ!'' సింపుల్‌గా చెప్పాడు.

''నేనంటే అంతిష్టమా?!'' కళ్ళు విశాలంగా అయ్యాయి.

''నాకన్నా..!''

''ఎందుకు?'' కుతూహలం.

''..ఒక స్త్రీగా నిన్ను గౌరవిస్తాను. ఆ స్త్రీయే నా బెస్ట్ హాఫ్ అయినందుకు ప్రేమిస్తాను. నీవు కోరుకునే స్వేచ్ఛ- నీ స్వతంత్ర ప్రవర్తన- నీ ఆత్మాభిమానం అవన్నీ నచ్చుతాయ్!''

''అర్థం కాలేదు..'' ఒప్పుకున్నాను.

''...ఏ ఆడదైనా పెళ్ళికాగానే భర్తపై సంపూర్ణంగా ఆధారపడాలని కోరుకుంటుంది. తన బాగోగులు, తన ముద్దూముచ్చట్లు-ఆఖరికి తన చీర సెలక్షన్ కూడా అతడే చేయాలనుకుంటుంది. అందుకే అంటారు. అమ్మాయిలు పెళ్ళయ్యే వరకు కేవలం మంచి భర్త రావాలని ఆ తర్వాత ఇక అన్నీ కావాలని...''

నవ్వాపుకోలేకపోయా!

''మరి నేను..''

''..నువ్వలా కాదు! ఎవ్వరైనా ఓదార్చితే బావుండని నువ్వు ఎదురు చూడవు. అంత బలహీనమన స్తత్వం- ఆధారం దొరికితే అల్లుకుపోయే నైజం కాదు నీది-''

కాస్త గర్వంగా తల ఎగరేశాను. మనుషులను అర్థం చేసుకునే తీరుకు, తనని అభినందించాల్సిందే! కానీ మగవాళ్లను మెచ్చుకుంటే మన మాట వినరని నా భావన.

కనసీవ్ అయ్యానని చాలా కాజువల్‌గా చెప్పా!

అతడు మాత్రం పొంగిపోయాడు.

''ఇద్దరు మనుషులు మరో మనిషిని ఈ సృష్టిలోకి ఆహ్వానించే సందర్భం అని- మన కలయిక ఈ ప్రపంచానికి ఒక నూత్న కానుక ఇస్తుందని '' ఏదేదో భావుకత్వం.

'అల్ప సంతోషి' అనుకున్నా.

అమ్మా, అత్తయ్య కట్టకట్టుకుని వచ్చారు.

ఉద్యోగం మానేయాలట! అంతే! రెక్కలు తెగిన పావురం కథ గుర్తుకొచ్చింది. ఎంతో వాదించా- అయినా వారిద్దరూ నన్ను ఓడిస్తూనే ఉన్నారు.

అభీ రావడంతోనే అతన్ని 'ఊ' అనిపించారు.

''రాజ్యాలు ఏలే ఉద్యోగమా-చక్కగా పిల్లో పిల్లాడో పుడితే జోలపాడుతూ ఉండక-'' అమ్మ మాటలు వినబడుతూనే ఉన్నాయి-

నేను బెడ్‌రూంలో ఉన్నాను. కళ్ళ మీంచి ఉబికుబికి వస్తున్నాయ్ కన్నీళ్ళు. మెల్లగా వచ్చి నా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

విసిరికొట్టా.

''పెంకి పిల్ల'' అంటూ బుగ్గ గిల్లాడు.

బుగ్గ తడి తడిగా ఉంది కదా!

''ఏమైందీ!?'' ఆదుర్దా ఆ గొంతులో.

''మీ అందరి కళ్లు చల్లబడ్డాయా!?'' ఉప్పెనలా కోపం.

''అలా ఆవేశపడద్దు పాపాయికి మంచిది కాదు''

''ఆపండి మీ కబుర్లు. నమ్మకద్రోహులు మీరంతా- నా జీవితాన్ని శాసిస్తారా?! గోముఖ వ్యాఘ్రం--'' ఇంకేదో అనబోయా.

''..నేనెవరిని?!''

ఒక్కసారిగా ఆగిపోయా.

''...అవును. నువ్వు నా భార్యవైనంత మాత్రానా నీ వ్యక్తిగత జీవితాన్ని శాసించడానికి నేనెవర్ని?'' నా వైపే సూటిగా చూస్తున్నాడు.

నా కర్థం కాలేదు.

''..పెంపకంలో ఉన్న ఆనందాన్ని, కష్టాన్ని నేనూ పంచుకోగలను. పనిలో ఇంకాస్త ఎక్కువ సాయం చేయాల్సి రావొచ్చు. పాలు పట్టడంలో తప్ప ఇంకే పనైనా ఫిఫ్టీ-ఫిఫ్టీ!''

''మరి నా ఉద్యోగం..!'' ఆశ్చర్యం-

''...బృందా! నీ అస్తిత్వానికి భంగం కల్గించే ఏ నిర్ణయమూ నే తీసుకోలేను. నీకిష్టమైతేనే మానేయ్- లేదంటే కంటిన్యూ చేయ్! జీవితాంతం తృప్తిని, గుర్తింపును, హోదాను, మన తెలివితేటలకు తగిన గౌరవాన్ని అఫ్‌కోర్స్ డబ్బును ఇచ్చే ఉద్యోగాన్ని వదులుకోవడమా లేదా అన్నది నీ ఇష్టం'' ఆగాడు.

నేను వింటున్నది నిజమేనా-

గట్టిగా కౌగిలించుకుని జల జల రాలుతున్న కన్నీళ్ళతో ఒకే ఒక మాట చెప్పానారోజు- ''ఐ లవ్యూ సోమచ్!''

★ ★ ★

''అబ్బా! ఎన్నాళ్ళకెన్నాళ్ళకే..బృందావనా?!'' నే పంపిన స్లిప్ చేతిలో పట్టుకుని బయటికొచ్చింది హేమ.

''ఏంటి విశేషం-పాపెలా ఉంది?'' దాని ఉత్సాహం, అదే పురుడు పోసింది. అందుకే!

''అభినయ్ ఎలా ఉన్నాడు?!'' మరో ప్రశ్న.

అన్నింటికీ టోటల్‌గా ఒక చిర్నవ్వు సమాధానమిచ్చా.

ఎవరో పేషంట్! చెకప్ చేసి మందులు రాసి పంపేసింది.

''ఇప్పుడు చెప్పు ఊరకనే రారు మహాత్ములు..''

''చెకప్ కోసం..''

''అప్పుడే మళ్ళీ సమ్‌థింగ్ సమ్‌థింగా?!'' దాని మాటల్లో అల్లరి.

''అబ్బ కాదే! బ్రెస్ట్‌లో కొన్నాళ్ళుగా నొప్పి. పాపకు పాలు పడుతూంటే కూడా! అభీ నా దగ్గరకి రాక నెలరోజులైంది'' నా కళ్ళలో పశ్చాత్తాపం.

నన్నోసారి భయంగా చూసి అంతలోనే ''ఓకే....ఓకే!'' అంటూ ఐదారు నిమిషాలు పరీక్షించి..''..ఆంకాలజిస్ట్‌ని కలవాలి. అక్కడ మెమోగ్రఫీ చేస్తారు. ఆ తర్వాత సైటాలజి టెస్ట్‌లో వచ్చిన రిపోర్ట్ ఆధారంగా మనకే విషయమైనా తెల్సిపోతుంది- డోంట్‌వర్రీ!'' తన ఓదార్పు.

''ఇప్పుడు వెళదామా?!'' నేను.

నా వైపు ఆశ్చర్యంగా చూసి ఒక నంబర్ డయల్ చేసింది.

పది నిమిషాల్లో అక్కడున్నాం.

మెమోగ్రఫీ లో నా బ్రెస్ట్ అంతా పరీక్షించారు.

సైటాలజి టెస్ట్ కోసం కాస్త మాంసాన్ని నా పాలిండ్ల నుండి తీసుకున్నారు. అప్పుడు కన్నీళ్ళొచ్చాయనుకో!

ఇదంతా హేమ చూస్తూనే ఉంది.

రిపోర్ట్స్ కూడా ఇపుడే కావాలనేసరికి హేమ నాతోనే మూడు గంటలు కూర్చుండిపోయింది.

అప్పుడు పిలిపించాడు డాక్టర్..''..సారీ అమ్మా! మీకు బ్రెస్ట్ కేన్సర్! రైట్ పార్ట్స్‌ని బ్రెస్ట్ రిమూవ్ ఆపరేషన్‌తో తొలగించాలి. లెఫ్ట్‌కి 'కీమోథెరపి' చేయాలి..''

ఆ మాటలు వింటూనే నా ముఖం తెల్లగా పాలిపోయింది.

చెయిర్‌లోంచి లేస్తూ తూలి పడబోయా- హేమ సపోర్టునిచ్చింది.

★ ★ ★

''..ఊరుకుంటే ఏమవుతుంది..అభీ?!''

''మూర్ఖంగా మాట్లాడకు. అది ఒళ్ళంతా పాకి చచ్చిపోతావ్!'' కుదిపాడు.

''ఆడదాని సహజ సంపద కదా! ఎలా కోల్పోయేది?! నిన్నెలా సుఖ పెట్టేది?!'' నిస్సహాయంగా నా మాటలు.

''ప్రాణం కన్నా ఎక్కువా?!'' తన ప్రశ్న.

ఇంకేం చెప్పాలో అర్థం కాలేదు.

హఠాత్తుగా అభి తలను నా గుండెలకు హత్తుకున్నా- గాలి చొరబడనంత గట్టిగా.

లోలోన చచ్చిపోతానేమోనన్నంత నొప్పి.

కొద్దిసేపటికి కొన్ని కన్నీటి చుక్కలు రాలిపడ్డాయ్ అభి తలపై!

''...ఏయ్! బృందా! ఏడుస్తున్నావా?! నేనేం తక్కువగా భావించనులే! నువ్వు గొప్ప- ఆ చిన్న మాంసపు ముద్దా! పాపకెలాగూ పాలు మాన్పించాలనుకుంటున్నాంగా? చిన్నతనంగా భావించకు!''

''అభీ!'' అంటూ ముఖాన్ని ముద్దులతో ముంచెత్తాను- మొదటిసారి.

నిజమే! ఇష్టం మనసునంతా ముంచేసినప్పుడు ఏం చేస్తున్నామో మనకే తెలీదు.

ఆపరేషన్ అయింది.

పదిహేను రోజులకు ఇంటికొచ్చాను.

నా ఆకారం నాకే అసహ్యంగా ఉంది. నిండుతనం పోయింది కదా! అమ్మా, అత్తమ్మతో సహా దగ్గరి వాళ్ళంతా వచ్చారు.

వారిని చూస్తూంటే నా శరీరంలో ఏ లోపముందో ఇట్టే తెల్సిపోతోంది. యవ్వనంలో అవి ఆడతనాన్ని, పెళ్ళయ్యాక అమ్మతనాన్ని ప్రసాదించేవి కదా! ఆడదానికి సహజ ధనమో, అందమో అవి!

అవునూ అభి అస్సలు బాధపడడేంటి?!

ఆ రాత్రి దగ్గరగా వచ్చి ''బృందా! నిన్ను ఈ క్షణంలో కూడా ఓదార్చను. సానుభూతి కూడా చూపను. నీకేదైనా జరిగితే కదా అలాంటివి అవసరం. నిజానికి ఓదార్పు ఎప్పుడవసరమో తెల్సా- అనుకోని విషాదం జరిగినప్పుడు. కానీ మనకు జరిగింది కాస్తంత ప్రమాదం'' అన్నాడు.

''మనకేంటి? జరిగింది నాకే కదా!'' నా అనుమానం.

''నువ్వు- నేను కాదా?!'' అతని వివరణ.

''అభీ! నీమీద నేనిక అన్నింటికీ ఆధారపడాలనుకుంటున్నా..'' అన్నాను గుసగుసగా.

''ఎందుకో!'' ముంగురులను వెనక్కి తోస్తూ తను.

''...భర్తంటే మరో మనిషని అందులో మగాడని అనుకున్నా నిన్నాళ్లు. కానీ ఈమధ్యే తెల్సింది. భార్యలో సగమని! ఇగోలు, భావాలు, ఈ గిరిగీతలు అమలిన ప్రేమ ముందు పరస్పర అర్పణ ముందు-గాలివాటమే! మనసులకు లింగభేదముండదు. తనువులకే కదా!'' తలెత్తి అతని కళ్ళలోకి చూశా-చిలిపిగా!

''అవునా!? మాటలు ఎక్కడ నేర్చావ్?!'' అల్లరిగా ముక్కు లాగాడు.

''అభీ! ఒక్కసారి నన్ను కౌగిలించుకోవా?!'' ఆర్తిగా అడిగా.

జాగ్రత్తగా పొదివి పట్టుకుని దగ్గరికి తీసుకున్నాడు.

ఆ హృదయంపై ముద్దుల వర్షం అదే పనిగా కురిపించా.

ఇది ఆరంభం! ☆